''కుదరదు.. ఈరోజే వెళ్లాలి!''.

''ఏమిటంత మొండితనం. ఈరోజు కుదరదు అంటున్నాను కదా.. రేపు వెళ్దాం''.

''మీరు ఆరు గంటలకల్లా రాకపోతే నేనే క్యాబ్ బుక్ చేసుకుని వెళ్లిపోతాను'' ఫోన్ కట్ చేసింది శృతి.

సాయంత్రం అయిదు గంటల కల్లా స్నానం చేసి, చీర మార్చుకుని రెడీ అయిపోయింది శృతి.

మాటిమాటికీ టైమ్ చూసుకుంటున్న శృతిని చూసి..

''అయితే అబ్బాయి వస్తున్నాడా!? మాల్‌కి వెళ్తున్నారా తల్లీ'' అని అడిగింది రాజేశ్వరి.

''వెళ్తున్నాం అత్తయ్య గారూ! ఆ పాడు పనిచేసింది ఎవరైనా వదిలేది లేదు''.

''జాగ్రత్త తల్లీ! వాడు ఎలాంటి వాడో.. మనసులో పగ పెట్టుకుని ఏం చేస్తాడో అనేదే నా భయం''.

''తప్పు చేసిన వాళ్లు భయపడాలి. మనకెందుకు అత్తయ్యా భయం?'' ధీమాగా అంది శృతి.

సరిగ్గా గడియారం ఆరు కొడుతూండగా వచ్చేశాడు సాగర్.

వస్తూనే..

''నొప్పితో తల బద్దలు అయిపోతోంది! కొంచం కాఫీ ఇవ్వు శృతి.. ప్లీజ్'' అన్నాడు.

శృతి బ్రూ కాఫీ కలిపి తెచ్చింది.

''కాఫీ తాగగానే స్నానం చేసి వచ్చేయండి. పొద్దుపోయిన కొద్దీ మాల్‌లో జనాలు పెరిగిపోతారు''.

అలాగే అన్నట్టుగా తల ఊపి, కాఫీ తాగి స్నానానికి వెళ్లాడు సాగర్.

పావు గంట టీవీ చూసి..

''ఆరున్నర అవుతోంది.. రావాలి!'' అంటూ టీవీ ఆఫ్ చేసి, బెడ్‌రూంలోకి వెళ్లింది శృతి.

సాగర్ స్నానం చేసి, నైట్ డ్రెస్ వేసుకుని కిటికీ దగ్గర కుర్చీలో కూర్చుని.. దీర్ఘంగా ఏదో ఆలోచిస్తున్నాడు.

''ఏమిటీ!? మీరింకా రెడీ అవలేదా? ఎన్నిసార్లు చెప్పాలి?'' అసహనంగా అంది శృతి.

''కొంచం జ్వరం వచ్చినట్లుగా అనిపిస్తోంది. పోనీ రేపు వెళ్దాం!? ఏమంటావు?'' శృతి వైపు చూడకుండా అన్నాడు సాగర్.

ఆ మాట వినగానే భర్త నుదుటి మీద చేయివేసి చూసింది శృతి.



**''అమ్మా.. వాడు అంతగా చెబుతున్నాడు కదా! ఇక్కడితో ఈ విషయం అందరం మరచిపోదాం. ఇక ఈ విషయంలో నువ్వు ముందుకు వెళ్ల వద్దు'' నచ్చ చెబుతున్న ధోరణిలో అంది రాజేశ్వరి.**

**''లేదు అత్తయ్య గారు! వాడు చేసిన పాడుపనికి వాడు శిక్ష అనుభవించాల్సిందే!'' ఖచ్చితంగా చెప్పేసింది శృతి.**

**సాయంత్రం అయిదు అవగానే భర్తకు ఫోన్ చేసింది.**

**''ఏమిటో త్వరగా చెప్పు. చాలా బిజీగా ఉన్నాను'' అన్నాడు సాగర్ చిన్నగా మాట్లాడుతూ.**

**''గుర్తుంది కదా.. సాయంత్రం మాల్‌కి వెళ్లాలి. ఆరు అవకుండా వచ్చేయండి''.**

**''ఇంకా నువ్వు అదే విషయం పట్టుకుని కూర్చున్నావు. చెప్పాను కదా.. గొడవ పెద్దది చేసి, నలుగురి నోట్లో పడటం ఎందుకని?! మరోసారి ఆలోచించు!''.**

**''మరో ఆలోచనే లేదు. వాణ్ని పోలీసులకి పట్టించి జైలుకి పంపించాల్సిందే!''.**

**''అలాగే చేద్దాం. చెప్పానుగా ఈరోజు చాలా బిజీ. మరోరోజు చూద్దాం''.**

''జ్వరం ఏమీ లేదు. ఎందుకో మీరు మాల్‌కి రాడానికి భయ పడుతున్నారు!''.

''అవును! ఈ గొడవ ఎక్కడిదాకా పోతుందోనని భయం''.

''మనం ఎందుకండీ భయపడాలి? అటువంటి పాడు పని చేసినవాడు భయపడాలి గానీ! డ్రెస్ మార్చుకోండి.. వెళ్దాం!'' భర్త చేయి పట్టుకుని పైకి లేవదీసింది శృతి.

పైకి లేస్తూనే చప్పున శృతి రెండు చేతులూ పట్టుకున్నాడు సాగర్..

''నన్ను క్షమిస్తానంటే నీకో నిజం చెబుతాను''.

''ఆ నిజం ఏమిటో తెలుసుకోకుండా క్షమిస్తానని ఎలా మాటిస్తాను?'' నిర్మొహమాటంగా అంది శృతి.

''ఆ రోజు మాల్‌లో నేను కూడా అటువంటి పాడు పని చేశాను!'' తల దించుకుని చెప్పాడు సాగర్.

''ఇప్పుడు మాల్‌కి వెళ్లి సీసీటీవీ ఫుటేజ్ చెక్‌చేస్తే.. నేను కూడా దొరికి పోతాను''.

''మీరు చేసిన పాడుపని నేను కళ్లారా చూశాను లెండి!''.

పక్కనే బాంబు పడినట్లు అదిరిపడ్డాడు సాగర్.

మొహంలో కత్తి వాటుకు నెత్తురు చుక్కలేదు. ఒంట్లో ఒణుకు.

''నా కోసం నిన్ను తాకినవాణ్ని క్షమించు''.

''నా ఒంటి మీద ఎవరూ చేయి వేయలేదు. మీరు చేసిన పాడు పని చూసినందుకే రాత్రంతా నిద్ర లేకుండా ఏడ్చాను నేను! మరి మీరు అసభ్యంగా ఒళ్లంతా తాకిన ఆ అమ్మాయి కూడా రాత్రంతా నా కన్నా ఎక్కువగా ఏడ్చి ఉంటుంది కదా! అటువంటి పాడుపని చేస్తే ఆడ వాళ్లు ఎంత బాధ పడతారో మీకు ఇప్పటికైనా అర్థమై ఉంటుందని అనుకుంటా! పోతే.. ఆ పని ఎంత ప్రమాదకరమో తెలియ చెప్పడానికి, మాల్ కి వెళ్లి సీసీ టీవీ పుటేజ్ చూద్దామని అన్నాను. ఆ అమ్మాయికి కూడా ఇటువంటి ఆలోచనే వచ్చి ఉంటే మీ పరిస్థితి ఎలా ఉంటుందో ఒకసారి ఆలోచించుకోండి. మీ అమ్మగారి ముందు తల ఎత్తుకొగలరా? హాస్టల్‌లో ఉండి ఇంజినీరింగ్ చదువుతున్న అబ్బాయి మీ గురించి ఏమనుకుంటాడు? ఒకసారి ఊహించుకోండి''..

ఊపిరి తీసుకోవడం కోసం అన్నట్టుగా క్షణం ఆగింది శృతి.

''ఈ నేరానికి జైలు శిక్ష పడొచ్చు, ఉద్యోగం ఊడొచ్చు!''.

''ఐయామ్ వెరీసారీ శృతి. నేను నిజంగా అంత దూరం ఆలోచించ లేదు. అనుకోకుండా అలా..''

''అనుకోకుండా అలా ఎలా చేస్తారండి? అసలు పరాయి ఆడదాని ఒంటి మీద చేయి వేయాలనే ఆలోచన ఎలా వస్తుంది? ఆ క్షణంలో మీకు మీ తల్లీ, చెల్లి, భార్య పిల్లలు ఎవరూ గుర్తుకు రారా?'' అప్రయత్నంగా గొంతు పెంచింది శృతి.

''నెమ్మది.. అమ్మ వినగలదు'' అన్నాడు సాగర్ గొంతు తగ్గించి.

''వింటే మంచిదే! తన పెంపకంలో కొడుకు ఎంత ఉన్నతంగా ఎదిగాడో తెలుసుకుంటారు''.

''ప్లీజ్ అలా మాట్లాడకు. ఇలా ఇదివరలో ఎప్పుడూ..'' అంటూ సాగర్ ఇంకా ఏదో చెప్పబోతూండగా అడ్డుపడింది శృతి.

''ఇంతకు మునుపు ఇలా ఎన్నిసార్లు ఇటువంటి పాడుపని చేశారని నేను అడగను. ఇక మీదట ఇలా ఎప్పటికీ జరగదని అబ్బాయి అభయ్ మీద ఒట్టు వేయండి'' అంటూ చేయి చాచింది శృతి.

మనస్ఫూర్తిగా ఆ చేతిలో చేయి వేసి, ప్రేమగా శృతిని దగ్గరికి తీసుకున్నాడు సాగర్. ■

## మాచిరాజు కామేశ్వర రావు



ఈ కథా రచయిత తూర్పుగోదావరి జిల్లా పత్తిపాడులో పుట్టారు. ఆయన రాసిన మొదటి కథ.. ప్రసిద్ధ బాలల కథల మాస పత్రిక చందమామ (1969 సెప్టెంబరు సంచిక)లో ప్రచురితమైంది. ఒక్క చందమామలోనే ఆయన రాసిన 256 కథలు ప్రచురితమయ్యాయి. అయిదు వందలకుపైగా కథలు, ఏడు నవలలు రాశారు. అయిదు కథా సంపుటాలు వెలువరించారు. ఆయన రాసిన 'పారిపోయిన దొంగ' కథ కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ 12వ తరగతి విద్యార్థుల పాఠ్యాంశంగా ఎంపికైంది. 'విధి నిర్వహణ' అనే కథను మహారాష్ట్ర పాఠశాల విద్యా ప్రణాళిక సంస్థ 6వ తరగతి పాఠ్యాంశంగా ఎంపిక చేసింది. బాలల అకాడమీ నవలల పోటీలో తను రాసిన 'అడుగుకో ఆపద' ప్రథమ బహుమతి గెలుచుకుంది. మాచిరాజు బాల సాహిత్యపీఠం స్థాపించారు. బడి పిల్లలకు ఏటా కథల పోటీలు నిర్వహిస్తున్నారు. మాచిరాజు సీతారామయ్య – రత్నకుమారి స్మారక పురస్కారాలను ఏటా ఇద్దరు బాలసాహితీవేత్తలకు ప్రదానం చేస్తున్నారు. ఇక ఈ కథ పుట్టుకకు బలమైన నేపథ్యమే ఉంది. ఆడవాళ్ల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న వారిని షీ టీమ్ అరెస్ట్ చేస్తున్న వార్తలు తరచూ వస్తుంటాయి. ఆ ఆకతాయిల్లో పరివర్తన కోసం 'ఎవరు కౌన్సెలింగ్ చేస్తే బాగుంటుంది' అన్న ఆలోచనకు అక్షర రూపమే ఈ కథ.